

రేషన్ బియ్యం పంపిణీ పూర్తి చేస్తాం

- పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ

మంచిర్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రేషన్ షాపుల పరిధిలో త్వరలోనే బియ్యం పంపిణీ పూర్తి చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కె శ్రీకళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రేషన్ నో స్టాక్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో ఈ నెల 12న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా మేనేజర్ ఈ నెల 20వ తేదీలోపు బియ్యం పంపిణీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 423 షాపులకు గాను 12 మండలాల్లోని 370 షాపులకు బియ్యం పంపిణీ జరిగినట్లు తెలిపారు. మిగితా ఆరు మండలాల్లో గడువు పెంచి పంపిణీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంచిర్యాల కంటే మరో 18 జిల్లాలు వెనుకంజలో ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బెల్లంపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ గురువారం తెలిపారు. దుర్గం సిద్ధార్థ, దాగాం శోభిత్ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి అండర్-14 స్కూల్ గేమ్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరి ఫణిరాజా, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, పీడీ రాజశేఖర్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శశికుమార్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మందమర్రిరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో యాదయ్య సూచించారు. గురువారం మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలోని గుడిపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు.వారిని ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. అలాగే మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని లేకుంటే చర్యలుంటాయన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు విద్యాదేవి ఉన్నారు.

మూడు రోజులు పత్తి కొనుగోళ్లు బంద్

చెన్నూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చెన్నూర్ మార్కెట్‌లో మూడు రోజుల పాటు పత్తి కొనగోళ్ల బంద్ చేశామని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎంఈ షాహబొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ హోలీ పండగ, శనివారం, ఆదివారం పత్తి కొనుగోళ్లు జరగవని జిన్నింగు మిల్లుల్లో ఎలాంటి పత్తి వాహనాలను ముందస్తుగా తీసుకువచ్చి వెయిటింగ్‌లో ఉంచకూడదని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్సెట్టిపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బీఏ, బీఎడ్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సంతోష్ మహాత్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యరులు ఈనెల 16తారీకు లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్ లేదా దాని సమాన విద్యార్హత ఉన్న అభ్యరులు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్టు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యూరియా వచ్చేసింది..

- యాసంగి సీజన్‌కు సరిపడా నిల్వలు
- ముందస్తు జాగ్రత్తలతో తప్పిన తిప్పలు
- జిల్లాలో లక్షా 13వేల ఎకరాల్లో వరిసాగు


గోదాములో నిల్వ ఉన్న యూరియా బస్తాలు

మంచిర్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా నిల్వలు సరిపడా ఉండడంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పినట్లయింది. వ్యవసాయ శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో యాసంగి సీజన్‌లో యూరియా కొరత లేదు. మార్క్‌ఫెడ్‌తో పాటు ప్రైవేట్ మార్కెట్‌లోనూ యూరియా నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయి. మరో పదిరోజుల్లో రైతులు చివరి డోస్ వేయనుండగా ఆ మేరకు సరిపడా యూరియా ప్రస్తుతం అందుబాటులో ఉంది.

ఇతర జిల్లాలకు సరఫరా...

జిల్లాలో సాగవుతున్న యాసంగి వరి సీజన్‌లో సరిపడా యూరియా పోను మిగిలిన స్టాకును వ్యవసాయ శాఖ అధికారులు ఇతర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఇప్పటివరకు జగిత్యాల జిల్లాకు 500 మెట్రిక్ టన్నులు, నిర్మల్ జిల్లాకు 500 మెట్రిక్ టన్నులు, ఆదిలాబాద్ జిల్లాకు 600 మెట్రిక్ టన్నులను సరఫరా చేశారు.

సకాలంలో సరిపడ స్టాక్ రావడంతోనే జిల్లా అవసరాలు పోను ఇతర జిల్లాకు సరఫరా చేసే అవకాశం కలిగిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. యాసంగి సీజన్ చివరిడోసు వేసేందుకు సమయం ఆసన్నమైనందున ఆ మేరకు నిల్వలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో మూడు వేల మెట్రిక్ టన్నుల వరకు స్టాక్ ఉండగా మార్క్‌ఫెడ్‌లో 800 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. దీంతో పాటు ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులు జిల్లాలో 224 ఉండగా వాటిలోనూ పుష్కలంగా నిల్వ ఉండడంతో యాసంగి సీజన్‌లో యూరియా కొరత వచ్చే పరిస్థితి లేదు.

విడతల వారీగా...

యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలో లక్షా 13వేల 602 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పంటకు సంబంధించి ఈ సీజన్‌లో పదివేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా విడతల వారీగా పూర్తి స్థాయిలో సకాలంలో జిల్లాకు స్టాకు చేరడంతో ఇబ్బందులు తలెత్తలేదు. దీనికి తోడు నీటి నిల్వలు కూడా సరిపడా అందుబాటులో ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వం సన్నరకం వడ్లను ప్రోత్సహిస్తుండడంతో రైతులు ఆ దిశగా ఉత్సాహం కన బరుస్తున్నారు. దీనికితోడు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారులు యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం కూడా కొరత లేకుండా ఉండేందుకు దోహదపడింది.

వినియోగంపై రైతులకు అవగాహన..

వరి సాగుకు అవసరమయ్యే యూరియా వినియోగంపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు తరుచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం సత్ఫలితాలను ఇచ్చింది. పంటకు ఎంత మోతాదు అవసరమో అంతే వేసేలా అవగాహన కల్పించారు. దీంతో అధిక యూరియా వినియోగాన్ని అరికట్టడంతో యాసంగి సీజన్‌లో కొరత లేకుండా సర్దుబాటు అయినట్లు అధికారులు చెబుతున్నారు. మూడు సంవత్సరాలుగా జిల్లాలో యూరియా కొరత

మిగతా 7వ పేజీలో

అద్దె భవనాలు.. ఇరుకు గదులు

- ఎనిమిదేళ్లుగా అరకొర వసతుల మధ్య నిర్వహణ
- కొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- నిధులు కేటాయించని ప్రభుత్వం

6

కూల్‌కూల్‌గా..

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఊపందుకున్న పండ్ల రసాలు, కొబ్బరి బోండాల వ్యాపారం
- కూలర్లు, రంజన్లకు పెరిగిన డిమాండ్

7



కోడ్ ముగిసినా.. ముసుగు తొలగలే..


ముసుగుతో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం

లక్సెట్టిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు గడిచినా విగ్రహాలకు ముసుగు తొలగడం లేదు. లక్సెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో గల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో అధికారులు ముసుగువేశారు. ఎన్నికల కోడ్ ముగిసి పదిరోజులు అవుతున్నా అధికారులు ముసుగు తొలగించడం లేదు. అధికారులు స్పందించి ముసుగు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి


విద్యార్థులు తయారు చేసిన కళాకృతులను పరిశీలిస్తున్న శ్రావణి

జైపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించాలని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి పేర్కొన్నారు. గురువారం కుందారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ట్ అండ్‌క్రాఫ్ట్ ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే స్వీయ క్రమ శిక్షణ కలిగి ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. గత సంవత్సరం టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కింద పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్ టీచర్ చిప్పకుర్తి శ్రీనివాస్ శిక్షణతో మెళకువలు నేర్చుకున్న విద్యార్థులు వేసిన వివిధ పెయింటింగ్‌లు, కళాకృతులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం టీజీఎఫ్‌డీసీ అధికారులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిలో నైపుణ్యం ఉంటుంది..

లక్సెట్టిపేట: ప్రతీ ఒక్క విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంటుందని మోటివేషనల్ స్పీకర్ బొల్లంపల్లి సత్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని బాలికల గురుకులంలో గురువారం పీఎంశ్రీ స్కీంలో భాగంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన మనో విశ్లేషణాత్మక ప్రేరణ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్క విద్యార్థిలో అనేకమైన నైపుణ్యాలు దాగి ఉంటాయని వాటికి వెలికితీసి దాన్నే లక్ష్యంగా పెట్టుకుని దాని సాధన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ రమాకళ్యాణి మాట్లాడుతూ ప్రతీఒక్కరు లక్ష్యం ఎంచుకుని చదివి పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్ రావు, జూనియర్ వైస్‌ప్రిన్సిపల్ శ్రీలత పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిగా ప్రదీప్

కాసిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిగా కాసిపేట మండల కేంద్రానికి చెందిన రత్నం ప్రదీప్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాసిపేట మండల కేంద్రానికి చెందిన ప్రదీప్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. ఆయన నియామకంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు అవగాహన

చెన్నూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ప్రేరణ, కమ్యూనికేషనల్ స్కిల్స్‌పై మోటివేషనల్ స్పీకర్, సోషల్ టీచర్ మేకల రామస్వామి అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, 21వ శతాబ్దపు జీవన నైపుణ్యాలు, క్రిటికల్ థింకింగ్, క్రియేటివ్ రైటింగ్, పరీక్షలపై సూచనలు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పట్వర్దన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు రజిత, సరిత, పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

జన్నారం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనకల్ పంచాయతీలోని చెరుకుగూడెంలో గురువారం పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు చేపట్టారు. గ్రామసమీపంలోని ఆలయానికి వెళ్లి బోనాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, ఆలయ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

దండేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ సూచించారు. దండేపల్లి పోలీసుస్టేషన్‌లో పరిదిలో వివిధ నేరాలకు పాల్పడిన రౌడీ షీటర్లుకు దండేపల్లి ఎస్సై తైసొనోద్దీన్‌తో కలిసి సీఐ గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

వేమనపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు హోలీ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవా లని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఒక ప్రకటనలో సూచించారు. సహజసిద్ధమైన రంగులతోనే హోలీ పండగను జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ఇష్టంలేని వ్యక్తులపై రంగులు చల్లవద్దని, రంగులు చల్లుకున్న స్నానాలు చేయడానికి చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని సూచించారు.

మద్దిమాడలో శివలింగం ప్రత్యక్షం


మద్దిమాడలో శివలింగం

కాసిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిమాడలో బుధవారం రాత్రి శివలింగం ప్రత్యక్షం కావడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం రాత్రి ఉయ్యాల రవి -స్వరూప దంపతుల ఇంటి ఖాళీ స్థలంలో శివలింగం ప్రత్యక్షం కావడం అందర్ని ఆశ్చర్యానికి గురిచేసింది. విషయం తెలుసుకున్న స్థానికులు శివలింగానికి పూజలు చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి


ఆసుపత్రిలోని వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం జిల్లాలోని చెన్నూరు మున్సిపల్ పరిధిలో 6,7 వార్డుల్లో తాగునీటి సరఫరా ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ మురళీ కృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా లేకుండా శుద్ధమైన తాగునీటిని అందించాలని తెలిపారు. నీటి ట్యాంకులు, పైపులైన్ల లీకేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించి నీటి సరఫరా పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని జిన్నింగు మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల వద్ద నుంచి మద్దతు ధర చెల్లించి పత్తి కొనుగోలు చేస్తామన్నారు.

అనంతరం చెన్నూరులో గల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా క్షయ, మొండి క్షయ కేసులను పరీక్షలు చేసి గుర్తించేందుకు ట్రూనాట్ యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఆస్తి పన్నులు వంద శాతం వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్షయ ప్రోగ్రాం సమన్వయకర్త సురేందర్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్ వైజర్ అశోక్, ల్యాబ్ సూపర్ వైజర్ వేణు పాల్గొన్నారు.

దివ్యాంగులు తప్పనిసరిగా యుడీఐడీ పొందాలి

మంచిర్యాల కలెక్టరేట్: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని దివ్యాంగులు యునిక్ డిసెబిలిటి ఐడీ కార్డు పొందాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్‌డీవో కిషన్, ఆర్ఎంవో భీష్మతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఎంపీడీవోలు, మీ సేవ ఆపరేటర్లకు సదరం నుంచి యుడీఐడీ బదలాయింపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్‌కు బదులుగా యుడీఐడీ పొందేందుకు అర్హులు మీ సేవ కేంద్రాల ద్వారా వివరాలు నమోదు చేసి యుడీఐడీ కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ సంబరాలు


తాండూర్ కేజీబీవీలో హోలీ వేడుకల్లో విద్యార్థినులు

తాండూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం ముందస్తు హోలీ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు డ్యాన్సులు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. పాఠశాల ఎస్‌వో కవిత మాట్లాడుతూ రసాయన రంగులతో హోలీ ఆడితే అనారోగ్యం పాలవుతామని, సంప్రదాయ రంగులతో హోలీ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదారాణి, సుమన, కళావతి, జ్యోత్స్న, శిరీష, ఉపాధ్యాయులు, విద్యారినులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని ఆయా గనుల వద్ద గురువారం సింగరేణి కార్మికులు ముందస్తు హోలీ వేడుకలను నిర్వహించారు. ఆయా డిపార్ట్‌మెంట్ల కార్మికులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం స్వీట్లు తినిపించుకున్నారు. కేకే5 గని వద్ద పిట్ సెక్రెటరీ సది ఆధ్వర్యంలో కార్మికులు అన్ని డిపార్ట్‌మెంట్ల వారీగా రంగులు చల్లి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు పాల్గొన్నారు.

జన్నారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సతీష్‌గౌడ్, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమన్వయంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 19లోగా గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణ అంశాలపై సమావేశాలు నిర్వహించాలన్నారు. పార్టీల ప్రతినిధులకు ఓటరు జాబితా సంబంధితదరఖాస్తు ఫారాల గురించి వివరించాలన్నారు. ఈ నెల 21లోగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిదుల సమన్వయంతో కృషి చేస్తామన్నారు. ఈ నెల 15న రాజకీయ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ చంద్రకళ,ప్రసాద్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రంగుల సందడి



మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగ సందర్భంగా గురువారం మంచిర్యాల మార్కెట్‌లో రంగులు, సామగ్రిని కొనుగోలు చేయడానికి కొనుగోలుదారులు దుకాణాలవద్ద బారులు తీరారు. దీంతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

వెంకటేశ్వర్, ఎంఈవో



ఆంధ్రజ్యోతి: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో 327 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారికి ఇప్పటికే హాల్ టికెట్లు అందజేశాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు?

ఎంఈవో: పదో తరగతి పరీక్షలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందిరనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశాం. 40 మంది సిబ్బందిని నియమించాం.

ఆంధ్రజ్యోతి: వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేశారు?

ఎంఈవో: పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేశాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి అంశాల వారీగా వారి సందేహాలను నివృత్తి చేయించాం. వందశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

- రెబ్బెన, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ





అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం, ఇరుకు గదుల్లో పనులు చేస్తున్న అధికారులు

అద్దె భవనాలు.. ఇరుకు గదులు

- ఎనిమిదేళ్లుగా అరకొర వసతుల మధ్య నిర్వహణ
- కొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- నిధులు కేటాయించని ప్రభుత్వం

ప్రజల అవసరాలను తీర్చే ప్రభుత్వ అధికారులు కొలువై ఉండే ప్రభుత్వ కార్యా లయాలు అద్దె భవనాల్లో, ఇరుకు గదుల్లో పగుళ్లు తేలిన గోడల మధ్య అధ్వాన పరిస్థితుల మధ్య కొనసాగుతున్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు తమ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు.

అధ్వాన పరిస్థితుల్లో..

అధికారులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు సైతం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా సరైన మరుగుదొడ్లు లేక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పనుల కోసం వచ్చిన ప్రజలు కూర్చోవడానికి సైతం సరిపడా స్థలం లేకుండా పోయింది. పిల్లలతో వచ్చే మహిళలకు సైతం మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన వారు తమ పని ముగిసే వరకు వేచి ఉండక తప్పని పరిస్థితి నెలకొంది.

పెంచికలపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యం, ప్రజలకు పాలన మరింత చేరువ చేసేందుకు గత ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. మండలాలు ఏర్పడి సుమారు ఎనిమిదేళ్లు కావస్తోంది. దాదాపుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల సిబ్బంది కొరతతో పనులు ఆలస్యమవుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఎనిమిదేళ్లు గడుస్తున్నా..

మండలాల పునర్వ్యీభజనలో భాగంగా పెంచి కలపేట. మండలంగా ఆవిర్భవించి ఎనిమి దేళ్లు గడుస్తున్నప్పటికీ తహసీల్దార్ కార్యాల యం, ఎంపీడీవో కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలకు మోక్షం లభించలేదు. పక్కా భవనాలు లేక అటు అధికారులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాల యాలకు భూములను కేటాయించే తహసీల్దార్ కార్యాలయంకే స్థలం కేటాయించకపోవడం గమనార్హం. ఆరె సంక్షేమ సంఘం భవనంలో ఇరుకు గదుల్లో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ భవనంపై పెచ్చులు ఊడుతూ పగుళ్లు తేలుతున్నాయి. దీంతో అధికారులను, ప్రజల భయాందోళన చెందుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎస్సీ కమ్యూనిటీ భవనంలో కొనసాగుతోంది. అక్కడా ప్రజలకు సరిపడా సౌకర్యాలు లేకుండా పోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేస్తే అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయని సౌకర్యవంతంగా ఉంటుందని మండలంలోని 12 గ్రామ పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.



పెచ్చులూడిన పై కప్పు భవనం

సొంత భవనాలు కరువు..

తెలిగే రమేశ్, మాజీ ఉప సర్పంచ్, ఎల్కపల్లి



పెంచికలపేట మండలంగా ఏర్పడి ఎనిమిదేళ్లు కావస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకుండా పోయాయి. పేరుకే మండల కేంద్రంగా కొనసాగుతోంది. ప్రజలకు ముఖ్యమైన పనులు ఉండే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాల యాలు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అక్కడ అరకొర వసతులతో సిబ్బంది, ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. అధికారులు స్పందించి పక్కా భవనాలు నిర్మించాలి.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భారీ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట



వెంకట్రావుపేట రోడ్డుపై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిడ్

సిర్పూర్(టి), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి, తెలంగాణ నుంచి మహారాష్ట్రలోకి భారీ వాహనాల రాకపో కలకు అడ్డుకట్ట వేశారు. వారం రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో 'అధిక లోడ్.. అడ్డదారుల్లో నడుస్తున్న వాహనాలు' అని వచ్చిన కథనానికి రవాణా శాఖ, పోలీసులు స్పందించారు. గురువారం సిర్పూర్(టి) మండలం వెంకట్రావుపేట- పోడ్సా మధ్యలో వెల్‌కం బోర్డు వద్ద ఇనుప గ్రిడ్‌లు ఏర్పాటు చేశారు. భారీ, బరువు వాహనాలు రాకపోకలకు అడ్డుకట్ట వేశారు. ఇనుప గ్రిడ్‌ల ఏర్పాటుతో ఈ మార్గం గుండా పెద్ద వాహనాలు వెళ్లడానికి ఆస్కారం లేకుండా పోయింది. కార్యక్రమంలో ఎంవీఐ తిరుపతి, ఎస్సై కమలాకర్, పంచాయతీ రాజ్ ఏ ఈ ఆత్మారాం, ఏఎస్సై రాములు, పోడ్సా సర్పంచ్ దేవిదాస్ ఉన్నారు.

బంగారు గొలుసు చోరీ చేసిన నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

జైపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని గంగ మణెమ్మ అనే మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును చోరీ చేసిన అంతర్‌జిల్లా నిందితుడు అల్లెపు కృష్ణను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. గురువారం జైపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 10న గంగ మణెమ్మ పనినిమిత్తం చెన్నూరు బస్టాండ్ ప్రాంతానికి రాగా మణెమ్మతో నిందితుడు కృష్ణ మాటలు కలిపి గ్రోమోర్ షాపు పక్కన గల నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి మణెమ్మను మెడలో ఉన్న బంగారు గొలుసు ఇవ్వకపోతే గొంతు నులిమి చంపుతానని బెదిరించి బలవంతంగా రెండు తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. గంగ మణెమ్మ చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. నిందితుడిని పట్టుకోవడానికి స్పెషల్ టీంను ఏర్పాటు చేసి గాలిస్తుండగా గురువారం ఎస్ఐ , తన సిబ్బందితో కలిసి కొత్త బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా నిందితుడు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతన్ని పట్టుకుని విచారించగా మణెమ్మ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును దొంగలించానని ఒప్పుకున్నాడన్నారు. అతని వద్ద నుంచి రెండు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అల్లెపు కృష్ణ జల్సాలకు, మద్యానికి అలవాటు పడి కూలీ పనులు చేయడం ద్వారా వచ్చిన డబ్బులు సరిపోక దొంగతనాలు చేస్తున్నాడని తెలిపారు. అతనిపై పలు పోలీస్‌స్టేషన్‌లలోకేసులు ఉన్నాయని తెలిపారు. చాలాసార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చి మళ్లీ దొంగతనాలు చేస్తున్నాడన్నారు. అల్లెపు కృష్ణ సిద్దిపేటటౌన్‌లోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటూ పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. నిందితుడిని పట్టుకున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూరు సీఐ రవీందర్, ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ సంపత్, దేవేందర్, జీవన్‌ను డీసీపీ అభినందించారు.

గంజాయి సరఫరా చేస్తున్న నిందితుల అరెస్టు

జైపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని శివారులో గంజాయి సరఫరా చేస్తున్న నిందితులను అరెస్టు చేశామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. గురువారం జైపూర్ లోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు ఈ నెల 11న దుర్గం సందీప్, దుర్గం సంజయ్ మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళ్లి అక్కడ రైల్వేస్టేషన్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చారు. గురువారం భీమారం మండల కేంద్రం సమీపంలోని నేషనల్ హైవే పక్కన క్రర డిపో ఎదురుగా సందీప్, సంజయ్‌లు వనపర్తి కరుణసాగర్, రావుల ఆదర్శ్‌కు గంజాయి అమ్ముతుండగా భీమారం ఎస్ఐ శ్వేత సిబ్బందితో కలిసి వెళ్లి గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకున్నారన్నారు. నిందితులను పట్టుకుని విచారించగా గంజా యి అమ్ముతున్నామని ఒప్పుకున్నారని తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న దుర్గం సందీప్, దుర్గం సంజయ్‌లతో పాటు కొనుగోలుచేసిన రాంటెంకి స్వస్తిక్‌కుమార్, వనపర్తి కరుణసాగర్, రావుల ఆదర్శ్, జునేరి శ్రీనివాస్ వద్ద నుంచి 1.595 కేజీల గంజాయిని, ఓ దిచక్రవాహనాన్ని, 39,875ను రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి సేవిస్తున్న యువకులకు డీసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంత రం నిందితులను కోర్టుకు తరలించారు. నిందితులను పట్టుకున్న భీమారం ఎస్ఐ శ్వేత, హెడ్ కానిస్టేబుళ్లు మల్లయ్య, ముత్తయ్య, కార్తీక్, హోంగార్డు సదాశివ్, అశోక్‌లను డీసీపీ అభినందించారు

తల్లీకూతుళ్ల ఆత్మాహత్యాయత్నం

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

మంచిర్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం చున్నంబట్టి వాడకు చెందిన పస్తం పోచమ్మ, కూతురు రాజమ్మ బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా తల్లి పోచమ్మ మృతిచెందింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తల్లీ కూతుళ్లు పోచమ్మ, రాజమ్మ ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. బుధవారం రాత్రి తల్లీకూతుళ్లు మద్యం మత్తులో గొడవ పడ్డారు. ఆ గొడవలో ఇద్దరు క్రిమిసంహారక మందు తాగారు. స్పృహతప్పి పడిపోయిన వారిని పోచమ్మ మనువడు భీమేశ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. పోచమ్మ మృతి చెందింది. రాజమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఐసీయులో చికిత్స పొందుతోంది. పోచమ్మ కుమారుడు పస్తం గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బెజ్జూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కావుడే లక్ష్మయ్య(52) అనే వ్యక్తి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మయ్య కొంత కాలంగా నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. మద్యం తాగవద్దని కుటుంబీకులు మందలించారు. మనస్తాపానికి గురైన లక్ష్మయ్య ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు రాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. భార్య కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తాండూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని నగరం గ్రామానికి చెందిన రావుల సాంబయ్య (60) అనే వ్యక్తి తన చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాంబయ్య ప్రతి రోజు మద్యం సేవించి ఇంట్లో గొడవ పడుతు ఉండేవాడు. భార్య మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిచంచగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

హోలీ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కెరమెరి/చింతలమానేపల్లి/బెజ్జూరు/పెంచికలపేట/దహెగాం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. ప్రజల హోలీ రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట లోపే వేడుకలు ముగించుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, అదే విదంగా పండగ వాతావరణాన్ని ముగంచుకుని ఇంటికి పరిమితం కావాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు లేదా పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. యువకులు ప్రజలకు అసౌకర్యం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సైలు విజయ్‌కుమార్, నరేష్, ప్రవీణ్‌కుమార్, కొమరయ్య, కె రాజు తదితరులు పాల్గొన్నారు.

యువతీయువకుడిపై దాడి

- నగదు, సెల్‌ఫోన్ అపహరణ

జైపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుమట్ల ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం యువతీ, యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చినట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన అరికెళ్ల సుమన్ గోదావరిఖనిలో చికిత్స పొందుతున్న తన బంధువును చూడడానికి ఆసుపత్రికి వచ్చాడు. బుధవారం సాయంత్రం అతని బంధువైన ఓ అమ్మాయిని తీసుకుని బైక్‌పై సీసీసీ నస్పూర్‌కు వెళ్తున్నారు. టేకుమట్ల ఎక్స్ రోడ్డు వద్ద మూత్రం పోయడానికి బైక్‌ను ఆపగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వారి వద్దకు వచ్చి సుమన్, యువతిని కొట్టుకుంటూ చెట్లలోకి తీసుకువెళ్లినట్లు తెలిపారు. తాళ్లతో చేతులు కట్టేసి వారి వద్ద ఉన్న నాలుగువేల నగదు, సెల్‌ఫోన్‌లను లాక్కుని పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సంఘటన స్థలాన్ని డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్ సందర్శించారు.

స్తంభాల తొలగింపు

కాగజ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ స్థలంలో అక్రమంగా వేసిన స్తంభాలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సిద్ధార్థ్, ఎంసీ మణిరాజ్ రాజీవ్ స్వగృహ స్థలాన్ని పరిశీలించారు. ఆన్‌లైన్ శాటిలైట్ మ్యాప్ ద్వారా అక్రమణలు వేసిన స్థలాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రాజీవ్‌స్వగృహ స్థలంలోనే ఉన్న ట్లు తేల్చారు. అక్రమంగా వేసిన మూడు ప్లాట్ల స్తంభాలను తొలగించారు. కాగా మొదట వేసిన తాత్కాలిక ప్రహరీని తొలగించక పోవడం అనుమానాలకు తావిస్తోందని, దీన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇందారం 1ఏ బొగ్గు గనిలో కూలిన సైడ్ వాల్ కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడిన కార్మికుడు

జైపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇందారం 1ఏ గని పని స్థలంలోని సైడ్ వాల్ కూలిన ఘటనలో సపోర్టుమెన్ కార్మికుడు అంగల రాజయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. గురువారం మొదటి షిఫ్టు విధుల్లో భాగంగా 10 గంటల ప్రాంతంలో రాజయ్యతో మరో ముగ్గురు గనిలోని మూడవ సీమ్, 11వ డీప్ 7వ లెవెల్ వద్ద గని పైకప్పుకూలకుండా సపోర్టులు పెట్టి దిమ్మ కడుతుండగా ఒక్కసారిగా సైడ్‌వాల్ కూలి బొగ్గు పెల్లలు కార్మికుడు రాజయ్యపై పడ్డాయి. దీంతో రాజయ్య ఎడమ కాలు నుజ్జునుజ్జయింది. నడుముకు గాయమైంది. అక్కడే ఉన్న ముగ్గురు కార్మికులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. గాయపడిన కార్మికుడిని మొదట శ్రీరాంపూర్‌లోని ఆర్కే 9 డిస్పెన్సరీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన కార్మికున్ని కార్మిక సంఘాల నాయకులు పరామర్శించారు.

ప్రమాదాన్ని కప్పి పుచ్చేందుకే తప్పుడు రిపోర్టు

ఇందారం 1ఏ గనిలోని పని స్థలంలో సైడ్‌వాల్ కూలి సపోర్టుమెన్ కార్మికుడు రాజయ్య గాయపడితే సింగరేణి యాజమాన్యం కార్మికుడు పనిచేస్తూ జారి పడ్డాడని తప్పుడు రిపోర్టు రాశారని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ, హెచ్ఎంఎస్ నాయకులు ఆరోపించారు. పని స్థలంలో రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు ప్రమాదాన్ని కప్పి పుచ్చేందుకు తప్పుడు రిపోర్టులు రాశారని మండిపడ్డారు. గని అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇటీవల ఇద్దరు కార్మికులు మృతి చెందారని తెలిపారు. తప్పుడు రిపోర్టు రాసిన గని అధికారులపై సింగరేణి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బీసీ లైజనింగ్ అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా బీసీ లైజనింగ్ అధికారిగా నియమితులైన ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణను బీసీ ఉద్యోగులు గురువారం సన్మానించారు. సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్కే-8 డిస్పెన్సరీలో అభినందనలు తెలిపారు. డీవైసీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ముష్కె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జీఎం దేవేందర్ పిలుపునిచ్చారు. జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం ఇన్విరాన్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా కోట్లాది మొక్కలను నాటుతూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నామని చెప్పారు. మంద మర్రి ఏరియాలో గనుల, డిపార్ట్‌మెంట్లతో పాటు పరి సర ప్రాంతాల్లో మొక్కల పెంపకానికి కృషి చేస్తున్నా మన్నారు. మొక్కలే మానవాళి మనుగడకు మూల కారణమని తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, అధికారులు ఉద్యోగుల్లో అవగాహన పెరిగిందని పర్యావరణ హితమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి స్థలాల్లో వనాల పెంపుదలకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్, ఏరి యా ఇంజనీర్ వెంకటరమణ, ఎస్కే గ్రూపు ఏజెంటు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి బ్లాకులు సంస్థకే కేటాయించాలి

శ్రీరాంపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బ్లాకులను వేలం వేయకుండా సంస్థకే కేటాయించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. శ్రీరాంపూర్-నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వేలంలో పాల్గొనాలని వినతిపత్రాలు ఇచ్చారన్నారు. గతంలో వద్దన్న వారే ఇప్పుడు కావాలనడం వెనుక ఉద్ధేశం ఏమిటని వారు ప్రశ్నించారు. దరఖాస్తును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, కేంద్ర నాయకుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కార్యదర్శి పి. అశోక్, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ఐ.క్రిష్ణ, రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం, సంతోష్, ఏఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి గోళ్ల అంజన్న, కార్యదర్శి మేకల పోశమల్లు, సింగరేణి ఉద్యోగులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతి అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం పూర్‌లోని ప్రగతి మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. సింగరేణి ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో శ్రీరాం పూర్ జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో సింగరే ణి వ్యాప్తంగా ఉన్న తొమ్మిది డివిజన్లకు చెందిన జట్లు పాల్గొన్నాయి. గురువారం కొత్తగూడెం కార్పొరేట్, శ్రీరాంపూర్ జట్లకు ఫైనల్ పోటీల్లో తలపడ్డాయి. శ్రీరాం పూర్ విజేతగా నిలిచింది. జీఎం ఎం శ్రీనివాస్, ఐఎన్‌టీ యూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతజట్టుకు బహుమతి అందజేశారు.

కోల్‌ఇండియా పోటీల్లో పతకాలు సాధించాలి

మందమర్రిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకా రులు కోల్‌ఇండియా పోటీల్లో పతకాలు సాధించాలని మందమర్రి ఏరియా ఇన్ చార్జీ జీఎం విజయ ప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి మందమర్రి ఏరియా స్థానిక సీఈఆర్ క్లబ్‌లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 60వ క్రీడా వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మిక విజేత క్రీడాకా రులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇప్పటి నుంచే క్రీడాకారులు సాధన చేస్తూ కోలిండియాలో సింగరేణి విజయపతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. ఈ సందర్భంగా కోల్‌ఇండి యాలో పతకాలు సాధించిన వారిని సన్మానించి అభినందించారు. అనంతరం విజేత కార్మిక క్రీడాకారులకు బహుమతుల ప్రదానం చేశారు. క్రీడాకారులు నిత్యం సాధన చేయడం ద్వారా రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్, క్రీడల గౌరవ కార్యదర్శి మాస్కుల కార్తిక్, డీవైపీఎం మైత్రేయ బందు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల కంటే కార్పొరేట్‌లకు బీజేపీ ప్రభుత్వం లాభం చేకూర్చే దిశగా అడుగులు వేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు కలీందర్‌అలీఖాన్, పౌలు, రవీందర్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున తీగల్‌పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని గురువారం హైదరాబాద్‌లో జాతీయ మానవ హక్కుల కమీషన్ చైర్ పర్సన్ విజయ భారతి సాయనికి బీజేపి నాయకుడు కమాలాకర్‌రావు పిర్యాదు చేశారు. బీజేపీ జిల్లా అద్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో కలిసి హైదరాబాద్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిసి పిర్యాదు చేసినట్లు కమాలాకర్‌రావు తెలిపారు. పోలింగ్ రోజున తనతో దురుసుగా ప్రవర్తించి చంపుతానని బెదిరించాడని తెలిపారు. మూడు అక్రమ కేసులు పెట్టారని, ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని కమిషన్‌ను కోరినట్లు తెలిపారు.

'డబుల్' ఇళ్లను పంపిణీ చేయాలి

మందమర్రిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాల చెట్టు సమీపంలో నిర్మించిన 570 డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని గురువారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ పేదల కోసం నిర్మించిన ఈ నివాసాలు సంవత్సరాలు గడుస్తున్నా పంపిణీ చేయకపోవడంతో పాడైపోతున్నాయని పేర్కొన్నారు. వీటిని పంపిణీ చేయకుండా ఎందుకు నిర్మించారో చెప్పాలన్నారు. వెంటనే పేదలకు గృహాలను పంపిణీ చేయాలని కోరారు. మూడు సంవత్సరాలుగా గృహాలను పంపిణీ చేయకపోడంతో శిథిలావస్థలకు చేరుకుంటున్నాయన్నారు. వెంటనే వీటిని ప్రజలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, పున్నం, చందు, శ్రీనివాస్, అశోక్, శ్రీకాంత్, భాగ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కూల్‌కూల్‌గా..



- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఊపందుకున్న పండ్ల రసాలు, కొబ్బరి బోండాల వ్యాపారం
- కూలర్లు, రంజన్లకు పెరిగిన డిమాండ్

నస్పూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు మొదలయ్యాయి. దాహార్తితో తల్లడిల్లి అల్లాడిపోయే పరిస్థితి వచ్చేసింది. వేసవిలో కొద్ది వేడి వాతావరణం నుంచి కాస్తా ఉపశమనం కోసం రకరకాల పానీయాల వైపునకు జనాలు అడుగులు వేస్తున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడా చౌరస్తాలు, ముఖ్య కూడళ్ల వద్ద తాత్కాలిక జ్యూస్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. పరీక్షలకు హాజరైయ్యే విద్యార్థులు, వివిధ పనుల కోసం వెళ్లిన బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చుకుంటారు. వేసవి దాహార్తిని తీర్చుకునేందుకు రకరకాల పానీయాలకు మొగ్గుచూపుతున్నందున జిల్లాలో జ్యూస్ సెంటర్లు వెలుస్తున్నాయి. ప్రజల కొబ్బరిబొండాలు, జ్యూస్ బండ్లు, చెరుకు రసం, మజ్జిగ, లస్సీలతో పాటు పుచ్చకాయలు, రకరకాల మట్టి కుండలు, రంజన్లు మార్కెట్లోకి వచ్చేశాయి. జనాలు కూడా చల్లదనం కోసం వాటిపై ఆసక్తి చూపడంతో అమ్మకాలు చేసే వ్యాపార కేంద్రాల వద్ద గిరాకి పెరుగుతోంది.

మట్టి కుండలు, రంజన్లు...

వేసవి సీజన్‌లో మట్టి కుండ ల వ్యాపారం ఊపందుకుంటుంది. పేదోడి ఫ్రీజ్‌గా పిలువబడుతున్న ఆదిలాబాద్ రంజన్లు, మట్టి కుండలు మార్కెట్లోకి వచ్చేశాయి. చల్లని నీటి కోసం ఇంటిలో, కార్యాలయాల్లో మట్టి కుండలు, రంజన్లు వేసవి సీజన్‌లో దర్శనమిస్తాయి. ఇందులో కుమ్మరి సారే మీద తయారు చేసిన కుండలతో పాటు ఆదిలాబాద్ రంజన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్క కుండ, రంజన్ సైజును బట్టి రూ. 200 నుంచి 300 వరకు, నల్లా ఉన్న వాటికి రూ. 250 నుంచి 350 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. మార్కెట్‌లో గుజరాత్ నుంచి ఇక్కడకు మట్టి కుండలను వ్యాపారులు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. వేసవి కాలంలో చల్లని నీటి కోసం మట్టి పాత్రలను వినియోగించడంతో మట్టి కుండలకు మంచి గిరాకి పెరిగింది.

● **కాసిపేట:** వేసవి తాపానికి తాళలేక ప్రజలు కూల్ డ్రింక్ షాపులతో పాటు జ్యూస్ బండ్ల వైపు పరుగులు తీస్తు న్నారు. ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగి కోల్‌బెల్ట్ ప్రాంతంలో గరిష్ఠంగా 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత దాటింది. దీంతో ప్రజలు ఎండతీవ్రతకు హడలెత్తిపోతున్నారు. గ్రామాలతో పాటు పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద పండ్ల దుకాణాలు, కొబ్బరిబోండాలు, జ్యూస్ బండ్లు, ఐస్‌క్రీం పార్లర్ల వద్ద ప్రజలు గుమిగూడుతున్నారు. మార్చి నెల ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలో





వచ్చిన మార్పుల వల్ల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ఎయిర్ కూలర్లు కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏసీలు, ఎయిర్ కూలర్ల వినియోగం భాగా పెరగనుంది. రాత్రిపూట చలి, పగటి పూట ఎండ అధికంగా ఉండడంతో ఏం చేయాలో తోచక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండ బారి నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే వడదెబ్బ బారిన పడే ప్రమాదం పొంచి ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కూలర్ల అమ్మకం పెరిగింది

అప్పాల శ్రీనివాస్, వ్యాపారి, కొండాపూర్ యాప

మార్చి నెల మొదటి వారం నుంచి కూలర్ల అమ్మకం పెరిగింది. ఏడాది మార్చి మొదటి వారంలోనే కూలర్లు కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. పెరిగిన ఎండ వేడి వల్ల ప్రజలు కూలర్లు కొనేందుకు వస్తున్నారు.

కొబ్బరి బోండాలకు పెరిగిన గిరాకీ...

ప్రకృతి సిద్ధమైన పోషక విలువలు, నీటిని కలిగి ఉన్న కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది. వేసవి కాలంలోనే కాకుండా అన్నికాలాల్లో ఆరోగ్య ప్రధాయినిగా కొబ్బరి బొండాలు లభిస్తున్నాయి. మార్కెట్‌లో కొబ్బరి బొండాలు రూ. 30 నుంచి 45 రూపాయల వరకు లభిస్తున్నాయి. ఆంధ్ర, కేరళ రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడకు కొబ్బరి బొండాలను తీసుకువస్తున్నారు. వేసవిలో కొబ్బరి బొండాలకు మంచి గిరాకీ పెరగడంతో వ్యాపారులకు చక్కటి లాభాలను తెచ్చి పెడుతుంది.



ఆయా రకాల జ్యూస్‌లు...

జిల్లాలోని మంచిర్యాల, నస్పూర్, బెల్లంపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట, జన్నారం, దండెపల్లి, చెన్నూరు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే జ్యూస్ సెంటర్లు వెలిశాయి. ఎండలో తిరిగి వచ్చి రెండు పుచ్చకాయ ముక్కలు తింటే వేసవి తాపం తగ్గితుందని కొందరు వాటిపై మక్కువ చూపుతున్నారు. ఐస్ ముక్కలు వాడకుండా ఆరోగ్యానికి మేలు చేసే తాజా పండ్ల రసాలపై దృష్టి సారించడంతో జ్యూస్ కేంద్రాల ఎదుట సందడి నెలకొంది. ద్రాక్ష, పైనాపిల్, చెరుకు రసం, అరటి, బత్తాయి, సపోట, పుచ్చకాయ, నిమ్మ షర్బత్, ఆపిల్, చెరకు, లస్సీ, మజ్జిగ, మిక్స్‌డ్ ఫ్రూట్స్ జ్యూస్ తదితర రకాల రసాలు జ్యూస్ సెంటర్లలో లభిస్తున్నాయి. పైనాపిల్ జ్యూస్ గ్లాసు రూ. 30, సపోట రూ 40, ద్రాక్ష గ్లాసు రూ. 40, బత్తాయి రూ. 30, నిమ్మ షర్బత్ రూ. 10, చెరుకు రసం రూ. 30, పుచ్చకాయ జ్యూస్ గ్లాసు రూ. 30, మిక్స్‌డ్ ఫ్రూట్స్ హోటళ్లలో రూ. 50 లకు లభిస్తున్నాయి. మార్కెట్ కిలో పుచ్చకాయ రూ.20లకు, దోసకాయలు కిలో రూ.40 నుంచి రూ.50లకు అమ్ముతున్నారు.



యూరియా వచ్చేసింది..

(5వ పేజీ తరువాయి)

లేకపోవడం అధికారుల కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. అలాగే ఫర్టిలైజర్ షాపులు సిండికేటుగా మారి అధిక ధరలకు యూరియా విక్రయించకుండ చర్యలు చేపట్టారు. దీంతో ఎంఆర్‌పీ రేటు రూ. 290కే బస్తా రైతులకు లభించింది.

పటిష్ట పర్యవేక్షణతోనే...

- జి కల్పన, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



యాసంగి సీజన్‌లో సుమారు 40వేల మంది రైతులు వరిసాగు చేశారు. మొత్తం లక్షా 13వేలపై చిలుకు ఎకరాల్లో వరి సాగు చేయగా పదివేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం వచ్చింది. మరో పది రోజుల్లో సీజన్ చివరి డోస్ కూడా వేయనుండగా ఆ మేరకు సరిపడా యూరియా నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాము. ఎప్పటికప్పుడు యూరియా నిల్వలపై పటిష్ట పర్యవేక్షణ చేయడంతో కొరత తలెత్తలేదు.

రేషన్ బియ్యం పట్టివేత

కన్నెపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి వెంకటేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు కన్నెపల్లి ఎస్‌ఐ గంగారాం తెలిపారు. బియ్యం నిల్వ ఉందనే సమాచారం మేరకు వెంకటేష్ ఇంట్లో తనిఖీలు చేయగా 3.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికిందన్నారు. దీనిపై విచారించగా సూర్జాపూర్ గ్రామానికి చెందిన ఇందూరి లక్ష్మణ్ అనే వ్యక్తి తన ఇంట్లో బియ్యాన్ని ఉంచాడని తెలిపాడు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ డీలర్ ఆత్మహత్యాయత్నం

మందమర్రిరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణపూర్‌లో రేషన్ డీలర్ పున్నం బుధవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. మంచిర్యాల అసిస్టెంట్ సివిల్ సప్లయి అధికారులు రేషన్‌షాపు తనిఖీలకు వచ్చి తనను వేధింపులకు గురి చేస్తున్నారని మాత్రలను మింగాడు. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

మందమర్రిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడో జోన్‌లో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు ఆలయం చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ వారు పంపిణీ చేశారు. అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో

బాల్య మిత్రుల కుటుంబానికి బాసట

దండేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి చదువుకున్న మంచిర్యాలకు చెందిన నాగరాజు, తిరుపతి అనే ఇద్దరు అన్నదమ్ములు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో మిత్రుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు దండేపల్లిలో చదువుకున్న ఎస్సెస్సీ మిత్రులు డబ్బులను పోగు చేశారు. గురువారం ఒక్కోక్కో కుటుంబానికి 10వేల రూపాయల చొప్పున ఆరిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-05 పదోతరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై అట్రాసిటి కేసు

మంచిర్యాల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొప్పు సతీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు అయ్యింది. నిందితుడు బొప్పు సతీష్ ఈనెల 11వ తేదీన ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండటం పసిగట్టి డోర్ తీసుకుని ఇంట్లోకి చొరబడి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ విషయమై లక్షెట్టిపేట ఎస్సై సతీష్‌ను వివరణ కోరగా బాదితురాలి పిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి, పలు సెక్షన్లతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను గురువారం జన్నారంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ దళితుడు అయినందునే ఉన్నత వర్గాల ఎమ్మెల్యేలు అగౌరవపర్చడం సరికాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీ, పసివుల్లా, సతీష్, ఇందయ్య, రాజశేఖర్, కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గర్మిళ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు గురువారం లయన్స్‌క్లబ్ సభ్యులు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీ అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్‌రెడ్డి, క్లబ్‌సభ్యులు బాల మోహన్, చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు లావణ్య, కృష్ణమూర్తి, రాణి, శశికుమారి, జ్యోతి, కళావతి, భాగ్యలక్ష్మీ, రాజయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా సందర్భంగా తపాలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మల విజయ్ ధర్మ తన సొంత ఖర్చులతో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు గురువారం అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌గౌడ్, సుశీల, ప్రధానోపాధ్యాయు డు మురళీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

శ్రీరాంపూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు గురువారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ లోని అంధుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

బెల్లంపల్లి: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన వేడుకల్లో వంశీనాథ్, శ్రీనాథ్, కార్తిక్, రేవంత్, అరుణ్, అలీభాయి పాల్గొన్నారు.

పీఎన్‌బీ ఖాతా తీసుకోవాలి

శ్రీరాంపూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఖాతా తీసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద బీమా కింద బ్యాంకు ద్వారా 40 లక్షల రూపాయలు వస్తాయని, ఈ అవకాశాన్ని కాంట్రాక్ట్ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆధార్, పాన్‌కార్డు అనుసంధానం చేసుకోండి

శ్రీరాంపూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు తమ ఆధార్‌కార్డుకు, పాన్‌కార్డును అనుసంధానం చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనుసంధానం లేకపోతే ఆదాయపు పన్ను శాఖ వారు విధించే జరిమానాకు బాధ్యులు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అనుసంధానం చేసుకోని 128 మంది ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

స్లాట్ రద్దు చేసుకున్న వారు సంప్రదించాలి

తాండూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

సంక్షిప్త సమాచారం..

మండలంలోని రైతులు భూమి కొనుగోలు, అమ్మకాల కోసం ఆన్‌లైన్ ధరణి పోర్టల్‌లో రుసుము చెల్లించి భూమి రిజిస్ట్రేషన్ అవ్వకముందే స్లాట్‌ను రద్దు చేసుకున్న రైతులు తిరిగి రుసుమును పొందడం కోసం తాండూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసు పుస్తం, ఆధార్‌కార్డు, రుసుము చెల్లించిన డీడీ, రుసుము కట్టిన బ్యాంకు పుస్తకం తీసుకురావాలన్నారు.

అమరవీరుల స్తూపానికి స్థలం కేటాయించాలి

బెల్లంపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాదిగ అమరవీరుల స్మారక స్తూపం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లకు ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు, నాయకులు రాజ్‌కుమార్, రాజలింగు, గోగర్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

భీమిని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడగా ఎస్సై విజయ్ కుమార్ వెయ్యి రూపాయల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు.

భగవద్గీత రికార్డు వేయవద్దు

మందమర్రిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎవరైన చనిపోతే వైకుంఠ రథం ద్వారా శ్మశానవాటికకు మృతదేహాన్ని తరలిస్తున్న సందర్భంగా భగవద్గీత రికార్డు వేయడం ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ రికార్డు వేయవద్దని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ రాజలింగుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారుత కుమారస్వామి, రాష్ట్ర నాయకులు రాంటెంకి దుర్గ రాజు, నాయకులు పోలేటి శివ పాల్గొన్నారు. .

సన్మానం

మందమర్రిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏరియాలోని కేకే ఓసీపీలో మేనేజర్‌గా పనిచేస్తూ జీడీకే 1కు బదిలీపై వెళ్తున్న సుదీర్ జక్కులవార్‌ను గురువారం స్థానిక జీఎం కార్యాయలంలోని కాన్ఫరెన్స్ హాలులో మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ ఘనంగా సన్మానించారు. ఎస్‌ఓటూ జీఎం విజయ్ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, పీఎం శ్యాంసుందర్, అధికారులు పాల్గొన్నారు.

'సెయింట్ జాన్స్'లో వార్షికోత్సవం

రామకృష్ణాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో బుధవారం రాత్రి పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషన ర్ జి. రాజు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్ధయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ పొన్నాల సుమన్, డైరెక్టర్ పొన్నాల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ రోడ్డులో చోరీ

మంచిర్యాల క్రైమ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో ఒక ఇంట్లో గురువారం చోరీ జరిగినట్లు సీఐ ప్రమోద్‌కుమార తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న బాలేశ్వర్ ఈనెల 12న కుటుంబసభ్యులతో కలిసి ఆసిఫాబాద్‌లో బంధువుల ఇంట్లో జరిగే ఒక శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి గురువారం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. వెంటనే బాలేశ్వర్ పోలీసులకు సమాచాం ఇవ్వడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. సుమారు 5తులాల బంగారం గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయిన్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నాడు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



కోల్‌సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషరేట్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు కఠిన చర్యలు తీసుకుంటామని లేదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. రామగుండం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: కమిషనరేట్‌లో నేరాల నియంత్రణకు తీసుకునే చర్యలు?

కమిషనర్: రామగుండం కమిషనరేట్ పారిశ్రామిక జిల్లాలతో కూడుకున్నది. ఊట్నూరు ఏఎస్‌పీగా ఉన్నప్పుడు మంచిర్యాల ఇన్‌చార్జి ఏఎస్‌పీగా పని చేశాను. ఈ ప్రాంత ప్రజలు మంచివారు. పోలీసులంటే భరోసా కల్పించేలా చర్యలు చేపడుతాను.

ఆంధ్రజ్యోతి: కమిషనరేట్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కు వగా ఉన్నాయనే ఆరోపణలున్నాయి.?

కమిషనర్: అసాంఘిక కార్యకలాపాలు, అసాంఘిక శక్తుల విషయంలో రాజీపడేది లేదు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు వెంటనే కమిషనరేట్ వదిలి వెళ్లిపోవాలి. లేకపోతే నేనే పంపించేస్తా. మంచిగా ఉండే వారికి గౌరవమిస్తా.

ఆంధ్రజ్యోతి: కమిషనరేట్ పరిధిలో యువతలో మార్పునకు ఏమైనా చర్యలు చేపట్టారా...?

కమిషనర్: కమిషనరేట్ ఎదుట యువత ఖాళీగా ఉండడాన్ని గుర్తించాను. రామగుండంలో యువత ఒక సంపద. వారికి శిక్షణనిచ్చి ఉపాధి వైపు తీసు కెళ్లాలి. తద్వారా సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలి. ఇందుకు సింగరేణి, ఎన్‌టీపీసీ వంటి పరిశ్రమలతోపాటు ప్రభుత్వశాఖలతో కూడా సంప్రదిస్తాను. త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు మొదలు పెడతాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి సామాజిక మహమ్మారిగా మారింది. దీని నియంత్రణకు చర్యలేమిటి?

కమిషనర్: గంజాయి నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ తీసుకుంటున్నా. డ్రగ్ కంట్రోల్ టీమ్ ఏర్పాటు చేశాం. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్ఐ, ఇతర సిబ్బంది ఈ టీములో ఉంటారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక నంబర్ కూడా ఏర్పాటు చేస్తా. గంజాయి రవాణా, విక్రయాలను ఉపేక్షించేది లేదు. గంజాయి సమాచారం చెప్పే వారి విషయంలో గోప్యత పాటిస్తాం.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

చెన్నూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసమే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. గురువారం ఇందిరా నగర్ సబ్‌స్టేషన్‌లో రూ. 98 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అదనపు 5ఎంవీఏ పీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పట్టణంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. పట్టణంలోని శివాలయం ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య కారణంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం చేశామన్నారు. పట్టణంలో ఎక్కడ లోవోల్టేజీ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ కైసర్, ఏడీఈలు బాలకృష్ణ, శరత్, ఏఈలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నెన్నెల తనిఖీ చేస్తున్న ఏవో సృజన, ఎస్సై ప్రసాద్

నెన్నెల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠినచర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి పుప్పాల సృజన, ఎస్సై ప్రసాద్ హెచ్చరించారు. గురువారం వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో మండలంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. విత్తన ప్యాకెట్ల నిల్వలు, స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్కులను పరిశీలించారు. షాపుల్లో ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. ఏఈవో రామ్‌చందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వేమనపల్లి: నీల్వాయి, వేమనపల్లి, గొర్లపల్లి గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎస్ఐ శ్యామ్ పటేల్, వ్యవసాయాధికారి వీరయ్యలు తనిఖీలు నిర్వహించారు. రైతులు కొన్న వాటికి బిల్లు రశీదులు అందించాలని సూచిం చారు.

కాసిపేట: రైతులు నకిలీ పత్తి విత్తనాలు కొని మోసపోవద్దని తహసీల్దార్ భోజన్న సూచించారు. గురువారం ముత్యంపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికరి ప్రభాకర్, ఏఈవో రమ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అభ్యాస పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అభ్యాస పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యాస పాఠశాల ప్రిన్సిపల్ సాన సుధతి మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటేనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ గిరీష్‌కుమార్, చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్ కళావతి, ఉపాధ్యాయు లు రోహిణిదేవీ, మాధురి, మనోహర్, సమత, మాధవీలత, సాగర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లాకు 47 మంది జూనియర్ లెక్చరర్ల కేటాయింపు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగం సాధించి బుధవారం సీఎం చేతుల మీదుగా ఉత్తర్వులు తీసుకున్న 47 మంది జూనియర్ లెక్చరర్లు జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించినట్లు డీఐఈవో కళ్యాణి తెలిపారు. ఇప్పటికే కొంత మంది విధుల్లో చేరారని గురువారం సాయంత్రం వరకు మిగితా వారు చేరుతారని తెలిపారు.

దేశీదారు పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం 226 దేశీదారు బాటిళ్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు గురువారం ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్డు వద్ద మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి సిరోంచకు వెళుతున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేశామని చెప్పారు. బస్సులో దేశీదారు 226 బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ. 7,910 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు రజిత, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని సైన్స్ ల్యాబ్‌లో పరికరాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. పీఎంశ్రీ పథకంలోని ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జ్యోతిబాపూలే పాఠశాలలను గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించినట్లు కాగజ్‌నగర్ మైనార్టీ గురుకుల బాయ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ శగుస్త ఫిర్ దోస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు మహేశ్వర్,జ్యోతి, ఉపాధ్యాయులు రాంబాబు, రామకృష్ణ, నాగమణి, రాజరెడ్డి, నిహారిక, ఆసీఫ్, ఆత్మారాం తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో వైద్య శిబిరం

కాగజ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు శాంతి భద్రతల పట్ల దృష్టి సారించటంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రామానుజం, పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై సుధాకర్, మహేందర్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల 'పొలంబాట'

పెంచికలపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపేట గ్రామంలో రైతులకు ఎస్ఈ శేషారావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్‌లకి కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ నాగరాజు, ఏఈ అంజల్‌కుమార్, సబ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, సిబ్బంది ధర్మయ్య, కిషన్ పాల్గొన్నారు.

నకిలీ విపత్తు

- దొడ్డిదారిన పల్లెలకు చేరుతున్న నకిలీ పత్తి విత్తనాలు
- పది రోజుల క్రితం పట్టుకున్న పోలీసులు
- అధికారులు దాడులు చేస్తున్నా అడ్డుకట్ట పడని వైనం
- ఏపీ నుంచి తరలించినట్లు నిందితుల అంగీకారం


పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాలు(ఫైల్)

చింతలమానేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏటా సీజన్‌కు ముందే ఎండాకాలంలో నకిలీ పత్తి విత్తనాలు గ్రామాలకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను అక్రమార్కులు దొడ్డిదారిన పల్లెలకు చేర్చుతూ రైతులకు అంటకడుతున్నారు. జిల్లాలో సు మారు మూడు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 3న మంచిర్యాల జిల్లా భీమిని మండలంలో నకిలీ పత్తి విత్త నాలు సరఫరా చేస్తూ జిల్లాలోని చింతల మానేపల్లి మండలానికి చెందిన ముగ్గురు పట్టుబడ్డారు. దీంతో పాటు దహెగాం మండలానికి చెందిన ఓ వ్యక్తి వద్ద భారీగా నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నికిలీ విత్తనాలు తరలిస్తూ పట్టుబడిన వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు నుంచి తీసుకువచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది.

● రైతులు జాగ్రత్త..

రైతులు జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. బీటీ-1 విత్తనాలు తలనత్త, గులాబీ రంగు, సెనగపచ్చ పురుగును తట్టుకుంటాయి. బీటీ-2 విత్తనాలు తలనత్త, గులాబీరంగు, సెనగపచ్చ పురుగు తో పాటు లద్దెపురుగులను కూడా తట్టుకునే శక్తిని కలిగి ఉంటాయి. కాగా బీటీ-3 వీటన్నింటితో పాటుగా కలుపు నివారణ రసాయనాన్ని తట్టుకుని అధిక దిగుబడి ఇస్తుందని పేర్కొన్నా శాస్త్రీయంగా మన దేశం లో నిరూపణ కాలేదు. దీంతో దీన్ని సాగు చేయవద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ బీటీ-3 విత్తనాలతో కలుపు బాధ ఉండదనే కొందరు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వందల ఎకరాలు సాగు చేసుకుంటున్న రైతులు ఈ విత్తనాలు నాటుతున్నారు. నాటిన నెల రోజులకు గ్లైఫోసెట్ (నిషేధిత గడ్డి మం దు) పిచికారి చేస్తే పత్తి మొక్కలు ఎండిపోకుండా గడ్డి మొక్కలు వాడిపోతాయి. మళ్లీ మొలకెత్తదు. కొన్ని సార్లు నకిలీ విత్తనాలు ఇవ్వడం తీరా పంటలు సాగైన తర్వాత దిగుబడి రాక రైతులు నష్టపోయిన ఘటనలు ఉన్నాయి. రైతులు రశీదు పొందిన విత్తనాలనే కొను గోలు చేయాలని, అప్రమత్తంగా ఉండాలని వ్యవసా యాధికారులు చెబుతున్నారు.

● అధికారులు చెబుతున్నా..

నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలను రైతులు సాగు చేస్తే లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. బీటీ-3 (గ్లైసిల్) పత్తి విత్తనాలు ఏడేళ్ల పాటు సాగు చేసిన భూములు పంటలకు పనికి రాకుండా పోతాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. దీని ద్వారా పంటలు పూర్తిగా పండకుండా పోయే ప్రమాదం ఉన్నదని వ్యవ సాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అనుమతి లేకుం డా విత్తనాలను విక్రయించే వారిపై విత్తన చట్టం-19 66, పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం కఠిన చర్యలు తీసుకునే ఆస్కారం ఉంది. ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ విత్తనాలు అంటగడితే కంపెనీ ప్రతిని ధుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటాని అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో పత్తి విత్త నాలు పట్టుబడిన సమయంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటే కొంత మేర నకిలీ విత్తనాల సరఫరాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. గత ఏడాది సైతం జిల్లాలో పోలీసులు భారీగా నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకుని పలువురిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని దహెగాం, బెజ్జూరు, చింతలమానేపల్లి, మండలాల్లో భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. గతంలో రుద్రాపూర్ గ్రామంలో 500 నకిలీ విత్తన ప్యాకెట్లు పట్టుబడ్డాయి. గంగాపూర్, గూడెం గ్రామాల్లో భారీగా విత్తనాలు పట్టుబడ్డాయి. కొందరు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా తరలిస్తూ గ్రామాల్లో విక్రయిస్తున్నారు. సరహద్దు గ్రామాల్లో పోలీసులు తనిఖీలు చేపడితే అడ్డుకునే అవకాశముందని చెబుతున్నారు.

అపార్ నమోదు పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అపార్ గుర్తింపు కార్డుల నమోదు, సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనం నుంచి గురువారం ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రమాదేవిలతో కలిసి సెక్టోరల్ అధికారులు, సహాయ గిరిజన సంక్షేమ శాఖాధికారులు, జిల్లాలోని అన్ని ప్రభుత్వం పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలో విద్య అభ్యసించే విద్యార్థుల అపార్ గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, తరగతి గదులు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బోధన తీరును పరిశీలించి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ రక్షణకు పాటుపడాలి


వాంకిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న సమతా సైనికులు

వాంకిడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సమాజ రక్షణకు ప్రతి ఒక్కరూ సమతా సైనికుడై పాటుపడాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ అన్నారు. గురువారం వాంకిడి మండల కేంద్రంలో సమతా సైనిక్ దల్ జిల్లా ఇన్‌చార్జి సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమత సైనిక్ 98వ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడానికి సమతా సైనికులు ముందుండాలన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సమతా సైనిక సభ్యులు మార్చ్ ఫాస్ట్ నిర్వహిం చారు. కార్యక్రమంలో బీఎస్ఐ సభ్యులు జయరాం, విలాస్, పాండుజీ, హిరీశన్, శంకర్, విజయ్, రోషన్ , ప్రతాప్, మనోజ్, చింటు, బలవంత్, ప్రశాంత్, శివాజీ, దీపక్, మహేష్, రమేష్, రాజేశ్వర్, జైపాల్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం కౌటగూడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో భవనాల మరమ్మతు పనులు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పనులలో నాణ్యత పాటించాలని, ఇంజనీరింగ్ అధికారులు పనులను పర్యవేక్షించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నమోదు అయిన గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేసవి కాలం దృష్ట్యా పిల్లలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ భవన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచలని, ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం తనిఖీలు చేపట్టాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సరుకులను చెడి పోకుండా రక్షించుకోవాలని, కాలం చెల్లిన పదార్థాలను ఉపయోగించకూడదని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట జిల్లా సంక్షేమాదికారి భాస్కర్, పోషన్ అభియాన్ సమన్వయకర్త గోపాలకృష్ణ, సూపర్‌వైజర్‌లు లైలా, పెంటుబాయి ఉన్నారు.

పరిశుభ్రమైన తాగునీటిని అందించాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పనుల నిమిత్తం సమీకృత కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు శుద్ధమైన చల్లటి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్‌ను ఆదేశించారు.

ఉపాధి కూలీల నిరసన


ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న కూలీలు

కాగజ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం దరిగాం చెక్ పోస్టు వద్ద ఎఫ్‌బీవో రవికుమార్ ఉపాధి హామీ పనులు అడ్డగించడాన్ని నిరసిస్తూ గురువారం ఉపాధి హామీ కూలీలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ తాము ఉపాధి హామీ పనులు చేస్తుండగా, ఎఫ్‌బీవో రవి తమకు వచ్చి దుర్భాషలాడారు. ఈ మేరకు ఎంపీడీవో రమేష్‌కు తామే స్వయంగా సమాచారం అందించినట్లు తెలిపారు. ఎంపీడీవో ఎఫ్‌బీవోతో మాట్లాడినా స్పందించలేదన్నారు. దీంతో తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎఫ్‌బీవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం మేరకు డీఎస్పీ రామానుజం, సీఐలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ పరిస్థితిని పర్యవేక్షించారు.

డీఆర్‌డీవో విచారణ

ఉపాధి హామీ పనులు అడ్డగించిన విషయంపై గురువారం డీఆర్‌డీవో దత్తారాం విచారణ జరిపారు. అటవీశాఖ స్థలంలో తవ్వకాలకు అనుమతి ఉందా అని ఎంపీడీవో రమేష్‌ను అడిగారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులిచ్చిన అనుమతి పత్రాలను చూపించారు. మహిళలతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్‌కు నివేదిస్తామని డీఆర్‌డీవో తెలిపారు. ఆయన వెంట జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఉన్నారు.

సద్దుమణిగిన వివాదం

ఉపాధి హామీ పనులను ఎఫ్‌బీవో అడ్డుకున్న వివాదం సద్దుమణిగింది. ఉపాధి హామీ కూలీలు ఎంపీడీవో రమేశ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. కాగా తనను ఎంపీడీవో రమేశ్ కులం పేరుతో దూషించారని ఎఫ్‌బీవో రవికుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఇరు శాఖ అధికారులతో జిల్లా కేంద్రంలో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఎంపీడీవో రమేష్, అటవీ శాఖ ఎఫ్ఆర్వో అనిల్ ఆధ్వర్యంలో చర్చలు జరిపి సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకున్నారు.

ఘనంగా శిశుమందిర్ వార్షికోత్సవం


నృతం చేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గురువారం వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు, పాఠశాల కార్యదర్శి వేణుగోపాల్, సహ కార్యదర్శి మధుకర్, కమిటీ సభ్యులు సంతోష్, శ్రీనివాస్, మాతృ భారతి సభ్యులు రమాదేవి, వైష్ణవి, స్వాతి, దుర్గ, అఖిల, సరిత పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న వ్యాపారి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై పడిపోయిన ఐదు వేల రూపాయలను బాధితుడికి అందజేసిన ఓ వ్యాపారి నిజాయితీ చాటుకున్నాడు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రఫూల్ గురువారం ఐదు వేల రూపాయలు వెటర్నరీ పరీక్ష ఫీజు కట్టడానికి జేబులో పెట్టుకుని ఆసిఫాబాద్ మార్కెట్‌కు బయలుదేరాడు. ఆసిఫాబాద్ మార్కెట్‌లోని వివేకానంద చౌక్ సమీపంలో డబ్బులు పడిపోయాయి. ఇది గమనించకుండా ఆయన మార్కెట్ నుంచి వెళ్లి పోయాడు. అనంతరం జేబులో చూడగా డబ్బులు కనిపించ లేదు. దీంతో డబ్బులు వెతుకుతూ మార్కెట్ వైపు వెళ్లాడు. ఆసిఫాబాద్‌లోని పరమేశ్వర్ ఫుట్‌వేర్ షాప్ యజమాని కృష్ణ తనకు మార్కెట్ సమీపంలో ఐదు వేలు దొరికాయని అందజేశాడు. కృష్ణను పలువురు వ్యాపారులు అభినందించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టి), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా 25 శాతం రాయితీ కల్పిస్తుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో తిరుపతి అన్నారు. మండల కేంద్రలోఓ గురువారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను స్వీకరించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

వాంకిడి, మార్చి 13 (అంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ముస్లింకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అంతకు ముందు జాగృతి నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాగృతి మండల నాయకులు కిరిమిల్ల వినోద్, మాజీ సర్పంచు బండె తుకారాం, బీఆర్‌ఎస్ నాయకులు ఎంగలి రాకేష్, రవి, శైలేష్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య

చింతలమానేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడీహేటి గ్రామానికి చెందిన అజ్మీర శాంతబాయి(53) అనే వివాహిత గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనారోగ్యానికి తోడు అప్పులు కావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. శాంతబాయి కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లాలో పలుచోట్ల కామదహనం


జాముల్‌ధరలో కామదహనం చేస్తున్న గ్రామస్థులు


ఆసిఫాబాద్‌లో కామదహనం చేస్తున్న ప్రజలు

ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలుచోట్ల గురువారం రాత్రి కామదహనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద గురువారం రాత్రి ప్రజలు కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణవాడ, పొట్టి శ్రీరాములుచౌక్, రావులవాడ, బజారువాడి, జన్కాపూర్, దస్నాపూర్, రాజంపేట, కంచుకోట, గొడవెల్లి తదితర కాలనీలలో ప్రత్యేక పూజల అనంతరం కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేశవనాథస్వామి ఆలయంలో అర్చకులు ఒజ్జల నరేష్‌శర్మ ఆధ్వర్యంలో డోలోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయాల్లో భజన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం రాత్రి కామదహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు కూడళ్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక పెట్రోలుపంపు ఏరియాలో ఏర్పాటు చేసిన కామ దహన కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో..

జైనూర్/లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో గురువారం హోలీ పండుగను పురస్కరించుకుని గిరిజన సంప్రదాయం ప్రకారం కాముడిని దహనం చేశారు. గిరిజన గ్రామంలో ప్రతీ కుటుంబానికి చెందిన వారు వారు తమ సంస్కృతీ, సంప్రదాయం ప్రకారం కుడుకలు, చక్కెర బిళ్లల హారాలను తీసుకుని గ్రామ పటేల్ ఇంటికి చేరుకుంటారు. పటేల్ ఇంటి ఎదుట కొంత మంది గిరిజన పెద్దలు కుడుకులు, చక్కెల బిళ్లల హారాలను సేకరించారు. మరికొందరు కామదేవతను వెదురు కర్రలతో మాతరి, మాతారను తయారు చేశారు. గ్రామ పొలిమేరలో కామదహనం అనంతరం వాయిద్యాల వాయిస్తూ గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తారు. కార్యక్రమంలో పవర్‌గూడ గ్రామ పటేల్ అనక మంతు, గ్రామస్థులు అనక రాంజీ, ఆత్రం బళిరాం, తోడుసం మానిక్‌రావ్, తోడుసం జంగు, తోడ్సం గంగారాం పాల్గొన్నారు.